ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
శుక్రవారం 9 మే 2025

భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 38.0
కనిష్ఠం : 27.0



కొవిడ్‌లో తినేశారు

- బిల్లుల చెల్లింపులో మునిసిపల్ అధికారుల అవకతవకలు
- ఆరుగురిపై పోలీసులకు ఫిర్యాదు
- ఉన్నతాధికారుల ఉత్తర్వులు

భీమవరం టౌన్, మే 8(ఆంధ్రజ్యోతి): కొవిడ్ సమయంలో భీమవరం మునిసిపాల్టీ నుంచి చెల్లింపుల్లో అవకతవకలు బయటపడ్డాయి. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కొవిడ్ సమయంలో కొనుగోలు చేసిన సామగ్రి బిల్లుల్లో తేడాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందడంతో విజిలెన్స్ విచారణ చేపట్టారు. తేడాలు గుర్తించిన విజిలెన్స్ అధికారులు మునిసిపల్ ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు. అధికారుల పరిశీలన అనంతరం అవకతవకలతో సంబంధాలున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డీఎంఏ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. కొవిడ్ సమయంలో మునిసిపల్ కమిషనర్లుగా పనిచేసిన ఇద్దరు, ఎఫ్-1 సెక్షన్ సీనియర్ అసిస్టెంట్, ఎఫ్-2 సెక్షన్ జూనియర్ అసిస్టెంట్, హెల్త్ అసిస్టెంటు, ఏఈలు ఇద్దరు, సీనియర్ అసిస్టెంట్ ఒకరు ఉన్నారు. వారిపై మునిసిపల్ అధికారులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పూర్తిస్థాయి ఫిర్యాదు తయారుచేసి ఇవ్వాలని పోలీసులు మునిసిపల్ అధికారులకు సూచించారు. మరోసారి ఫిర్యాదు ఇచ్చేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. గతంలో పనిచేసిన కమిషనర్ కె.రమేష్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ సీహెచ్ కామేష్‌బాబు, జూనియర్ అసిస్టెంట్ జీవీ.మధు చంద్రశేఖర్, హెల్త్ అసిస్టెంట్ ఎస్.చంటిబాబు, ఏఈ వీవీఎస్.కోటేశ్వరరావు, ఏఈ కె.రాజకుమార్‌పై ఫిర్యాదు చేయనున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నామని కమిషనర్ రామచంద్రారెడ్డి తెలిపారు.



కాళ్ళకూరు వెంకన్న కల్యాణం

కాళ్ళకూరు వేంకటేశ్వరస్వామి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. గురువారం ఉదయం పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెల అలంకరణలో స్వామి, అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా గరుడ సేవ అనంతరం వేద పండితులు, ఆలయ అర్చకుల సమక్షంలో డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు, రమాదేవి దంపతులు కల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిపారు. కలెక్టర్ నాగరాణి అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

మత్స్యావతారం

శేషాచల కొండపై వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా స్వామివారు గురువారం మత్స్యావతారంలో దర్శనమిచ్చారు. మరోవైపు ఉత్సవాలకు ఇంద్రాది అష్టదిక్పాలకులు, సర్వ దేవతలు, దేవగణాలను స్వాగతిస్తూ వేదమంత్రోచ్ఛరణలతో అర్చకులు ధ్వజస్తంభంపై గరుడ పటాన్ని ఎగురవేశారు. ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలు, మృద్గ్రహణ, అంకురార్పణ, ధ్వజారోహణ వైభవంగా నిర్వహించారు.

7



సొమ్ముల్లేవ్!

రైతులకు సహకార బ్యాంక్ ఝలక్



ధాన్యం విక్రయించిన తాడేపల్లిగూడెం రైతు కోడూరి సత్యనారాయణ ఖాతాలో ప్రభుత్వం రూ.5 లక్షలు జమ చేసింది. డీసీసీబీ తాడేపల్లిగూడెం శాఖలోని సత్యనారాయణ ఖాతాలో సొమ్ములు జమయ్యాయి. రోజుకు రూ.50 వేలు మాత్రమే ఇస్తున్నారు. మూడు రోజుల నుంచి ఆయన బ్యాంకు చుట్టూ తిరుగుతూ రూ.50 వేలు చొప్పున తెచ్చుకుంటున్నాడు.

- రైతులకు ధాన్యం సొమ్ము చెల్లింపులో పరిమితి
- రోజుకు రూ.50 వేలు మాత్రమే
- లబోదిబోమంటున్న అన్నదాత
- బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

డీసీసీబీ శాఖలోని రైతు ఖాతాలో జమ అయిన సొమ్ము రోజుకు రూ.50 వేల చొప్పున తీసుకోవాల్సి వస్తోంది. అంతే పరిమితి ఉందని సిబ్బంది చెబుతున్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల వ్యవధిలోనే ప్రభుత్వం సొమ్ము జమ చేసినా రైతులకు అందడం లేదు. వాణిజ్య బ్యాంకుల ఖాతాల నుంచి రైతులకు మొత్తం సొమ్ము సక్రమంగా ఇచ్చేస్తున్నారు.

గతంలో గ్యారెంటీలతో జోష్

జాతీయ బ్యాంకులు, ప్రైవేటు వాణిజ్య బ్యాంకులు గతంలో మిల్లర్లకు బ్యాంకు గ్యారెంటీలు ఇవ్వడానికి ముందుకు రాలేదు. అప్పట్లో డీసీసీబీ శాఖలు గ్యారెంటీలు ఇచ్చాయి. గత తెలుగుదేశం హయాంలో మిల్లర్లకు బ్యాంకు గ్యారెంటీలు ఇచ్చే స్థాయిలో డీసీసీబీలు ఉండేవి. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవడంతో మిల్లర్లు ఆసక్తి చూపడం లేదు. డీసీసీబీల్లో సేవలు అంతంత మాత్రమేనని మిల్లర్లు వాణిజ్య బ్యాంకులను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వం డీసీసీబీల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తోంది. డీసీసీబీలకు గతంలో మంజూరుచేసిన కమీషన్ ఇందులోనే డిపాజిట్ చేశారు. రూ.100 కోట్ల మేర సొసైటీల సొమ్ములు డీసీసీబీలోనే ఉన్నాయి. ఏటా 8 శాతం వడ్డీని మాత్రమే సొసైటీలకు డీసీసీబీ చెల్లిస్తోంది. డీసీసీబీని బలోపేతం చేయాలన్న ఉద్దేశంతో అప్పటి అధికారులు కమీషన్ సొమ్ము డీసీసీబీ ఖాతాలో జమ చేశారు. తాజాగా రైతులకు ప్రభుత్వం జమ చేస్తున్న సొమ్ములను చెల్లించలేని పరిస్థితి.

20 శాతం సహకార బ్యాంకుల్లోనే జమ

ప్రభుత్వం కొనుగోలు చేసే ధాన్యంలో 20 శాతం సొమ్ము జిల్లా కేంద్ర సహకార బ్యాంకు శాఖలలో జమవుతోంది. ఇప్పటి వరకు జిల్లాలో 5.50 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించారు. రైతు ఖాతాల్లో రూ.1150 కోట్లు జమ చేశారు. సహకార బ్యాంక్ శాఖల్లో ఖాతాలున్న 20 శాతం మంది రైతులకు వాటిలోనే నగదు జమ అయింది. ఇప్పుడిదే రైతుకు శాపంగా మారింది. దీనిపై ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకుని తమకు మేలు జరిగేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

తొలి తప్పుగా వదిలేయండి!

హాజరు నమోదులో వైద్య సిబ్బంది ట్యాంపరింగ్

వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శికి అభ్యర్థన

రెడ్ క్రాస్ సేవలకు కలెక్టర్లకు అవార్డులు

గవర్నర్ నుంచి పురస్కారం అందుకున్న కలెక్టర్ నాగరాణి

పెళ్లి పేరుతో నమ్మించి డాక్టర్‌కే అబార్షన్

పోలీసులకు ఫిర్యాదు

7



నరకదారికి మోక్షం

తాడేపల్లిగూడెం ప్రధాన రహదారి నిర్మాణానికి రూ.6.70 కోట్లు మంజూరు

పెంటపాడు, మే 8(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం పట్టణ నరకదారికి మోక్షం కలగనుంది. రహదారి నిర్మాణానికి ప్రభుత్వం రూ.6.70 కోట్లు మంజూరు చేసింది. గోతులు పడిన రహదారిని గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. రహదారి దుస్థితిపై 'నరకదారి' శీర్షికన గత నెల 10న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై స్పందించిన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సంబంధిత అధికారులతో సమీక్షించి ప్రతిపాదనలు సిద్ధం చేయించారు. అంతకు ముందు అసెంబ్లీ సమావేశాల్లో కూడా ఈ సమస్య ప్రస్తావించారు. ఆయన కృషి ఫలించి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కడకట్ల ఫ్లైఓవర్ నుంచి ప్రత్తిపాడు వై.జంక్షన్ (కనకదుర్గమ్మ ఆలయం వరకు) రహదారి నిర్మాణానికి రూ.6.70 కోట్లు మంజూరయ్యాయి. టెండర్ల దశ కూడా పూర్తి కావడంతో నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి.

పట్టణంలోని ముత్యాలాంబపురం నుంచి బాదంపూడి రహదారి కూడా గోతులతో అధ్వానంగా మారింది. ఈ రహదారి నిర్మాణానికి కూడా రూ.3.50 కోట్లు ప్రతిపాదనలు పంపించారు. ప్రత్తిపాడు వై.జంక్షన్ నుంచి జాతీయ రహదారి జంక్షన్ వరకు రహదారి నిర్మాణానికి కూడా అధికారులు ప్రతిపాదనలు పంపించనున్నారు.

బ్లాక్‌స్పాట్‌లో చెత్తవేస్తే జరిమానా



పట్టణాల్లో అపరిశుభ్ర వాతావరణానికి అధికారులు చెక్ పెడుతున్నారు. ఎక్కడబడితే అక్కడ చెత్త వేయకుండా మునిసిపల్ వాహనాలు వచ్చినప్పుడే ఇవ్వాలని అధికారులు విస్తృత ప్రచారం చేస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. కొన్ని బ్లాక్ స్పాట్‌లను గుర్తించి ఇక్కడ చెత్త వేయరాదంటూ స్పష్టం చేస్తున్నారు. అయినప్పటికీ ఆశించిన ప్రయోజనం కనిపించకపోవడంతో అధికారులు మరింత కఠినంగా వ్యవహరించనున్నారు. బయట చెత్త వేస్తే జరిమానా విధించాలని నిర్ణయించారు.

- ఆరు మునిసిపాలిటీల్లో 214 ప్రాంతాల గుర్తింపు
- చెత్త వెయ్యకుండా ప్రత్యేక బృందాలతో పర్యవేక్షణ
- భీమవరంలో సీసీ కెమెరాలు, బోర్డుల ఏర్పాటు

భీమవరం టౌన్, మే 8(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా బ్లాక్ స్పాట్‌లలో చెత్త వేయకుండా నివారణ చర్యలకు శ్రీకారం చుట్టారు. జిల్లాలోని భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, నరసాపురం, ఆకివీడు మునిసిపాటీల్లో 214 బ్లాక్‌స్పాట్‌లను అధికారులు గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో చెత్త వెయ్యకుండా నిఘా ఉంచి కఠిన చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ప్రతీ వార్డులో గుర్తించిన బ్లాక్‌స్పాట్‌లో చెత్త వెయ్యకుండా నిరంతర పర్యవేక్షణకు సచివాలయ ఉద్యోగితోపాటు పారిశుధ్య కార్మికుడిని ఏర్పాటు చేయనున్నారు. ఎవరైనా చెత్త వేస్తే జరిమానా విధిస్తారు. అవసరమైతే కఠినచర్యలు తీసుకుంటారు.

పట్టణం	బ్లాక్‌స్పాట్‌లు	నిరోధించినవి
భీమవరం	59	58
తాడేపల్లిగూడెం	54	18
పాలకొల్లు	40	38
నరసాపురం	19	17
తణుకు	23	4
ఆకివీడు	25	3

సీసీ కెమెరాల ఏర్పాటు

భీమవరంలో గుర్తించిన 59 ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు పెట్టారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు మునిసిపల్ పారిశుధ్య విభాగం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. అనుమతి రాగానే వీటిని ఏర్పాటుచేసి చెత్త వేసేవారిని గుర్తిస్తారు.

పట్టణంలో ప్రత్యేక నిఘా

పట్టణంలో బ్లాక్‌స్పాట్‌లో చెత్త వేసేవేరిని గుర్తించేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. సీసీ కెమెరాలు పెడుతున్నాం. అలాగే చెత్త వేస్తున్నప్పుడు ఎవరైనా గమనించి ఫొటో తీసి పంపిస్తే కఠిన చర్యలు చేపడతాం. ప్రతీ స్పాట్ వద్ద ఇద్దరు చొప్పున సిబ్బందిని ఏర్పాటుచేశాం.

- కె.రామచంద్రారెడ్డి, కమిషనర్



మత్స్యశాఖ అధికారులకు సూచనలిస్తున్న రఘురామకృష్ణంరాజు

కలుషిత జలాలు వదలొద్దు

- కాల్వ గట్లను ఆక్రమిస్తే సహించం..
- ఎంత పెద్ద రాజైనా వదలం
- ఆక్వా రైతులకు డిప్యూటీ స్పీకర్ రఘురామ హెచ్చరిక

కాళ్ళ, మే 8(ఆంధ్రజ్యోతి): 'ఉండి నియోజకవర్గంలో కొన్నిచోట్ల ఆక్వా చెరువుల్లోని కలుషిత జలాలను పంట కాలువల్లోకి వదులుతున్నారు. వారిని గుర్తించాం.. త్వరలో వారికి నోటీసులు ఇస్తాం. తీరు మార్చుకోకపోతే చర్యలు తీసుకుంటాం. కొందరు ఆక్వా రైతులు ఆక్రమించిన కాలువ గట్లను కొట్టేస్తాం. ఎంత పెద్ద రాజు వున్నా రాజీ ప్రసక్తే లేదు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించాం' అని డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు స్పష్టం చేశారు. పెద అమిరంలో గురువారం రఘురామ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'కాలుష్య రహిత నియోజకవర్గమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. వేసవిలో పంట, మురుగు కాలువల ప్రక్షాళన పూర్తికి ప్రణాళికలు సిద్ధం చేశాం. రెండు రోజుల క్రితం ఒకేసారి ఏడుచోట్ల కాలువల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టాం. వచ్చే 45 రోజుల్లో నియోజకవర్గంలో నీటి సమస్య లేకుండా చేయాలనే ఆశయంతో పని చేస్తున్నాం. ప్రజల సహకారంతో అభివృద్ధిలో నియోజకవర్గం రాష్ట్రంలోనే ముందుండాలని భావిస్తున్నాం. ఇప్పటికే దాతల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. ఫైబర్ కేబుల్ నెట్‌వర్క్ ఏర్పాటు చేసి పెద అమిరంలో కార్యాలయం ఏర్పాటు చేస్తున్నాం. రెండు, మూడు నెలల్లో ఇది పూర్తవుతుంది. దీనివల్ల క్రైం రేటు తగ్గుతుంది. ఆకివీడు పట్టణపరిధిలో ఓపెన్ ఎయిర్ థియేటర్ ఏర్పాటు చేయనున్నాం' అని రఘురామ వివరించారు. 'ఆపరేషన్ సిందూర్' టీమ్‌కు అభినందనలు తెలిపి.. మోదీ సర్కార్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించారు.



బిహార్ ఫిషరీస్ డైరెక్టర్‌తో జేసీ రాహుల్‌కుమార్

ఆక్వా రైతుల సమస్యలు పరిష్కరిస్తాం : జేసీ

ఉండి, మే 8(ఆంధ్రజ్యోతి): ఆక్వా రైతుల సమస్యలను పరిష్కరిస్తామని జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఎన్ఆర్‌పీ అగ్రహారంలోని మత్స్య పరిశోధన కేంద్రంలో ఆక్వా రైతులకు మూడు రోజుల శిక్షణ గురువారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో జేసీ మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతో అధిక ఉత్పత్తులు సాధించవచ్చన్నారు. జిల్లాలో రైతులు మరిన్ని కొత్త పద్ధతులను తెలుసుకునేందుకు నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డ్‌తో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. శిక్షణ పొందిన రైతులకు సర్టిఫికెట్లు అందించారు. మత్స్యపరిశోధన కేంద్రాన్ని బిహార్ మత్స్యశాఖ డైరెక్టర్ అభిషేక్ పరిశీలించారు. ఆక్వా సాగు విధానాలు తెలుసుకున్నారు. ఫిషరీస్ జేడీ నాగలింగాచారి, డాక్టర్ సుగుణ, డాక్టర్ చంద్రశేఖర్, డీడీ శ్రీనివాస్, డాక్టర్ ఫణిప్రకాశ్, ఎఫ్‌డీవోలు, అధికారులు పాల్గొన్నారు.

మృత్యుఘోష

జిల్లాలోని పేరుపాలెం సాగర తీరం ప్రమాదాలకు నిలయంగా మారింది. ఆహ్లాదకర వాతావరణం, ప్రకృతి రమణీయత, సముద్ర అలలు, తీరం వెంబడి కొబ్బరి, సరుగుడు తోటలు పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తాయి. పలు ప్రాంతాల నుంచి యువకులు, మహిళలతో పాటు కుటుంబ సమేతంగా ఇక్కడికి రావడం పరిపాటి. సముద్రంలో స్నానానికి దిగిన యువకులు అలల ఉధృతికి కొట్టుకుపోయి విగత జీవులుగా తీరానికి చేరడం విషాదం నింపుతోంది.



- సాగర తీరంలో పొంచివున్న మృత్యువు
- సముద్రంలో కలిసిపోతున్న నిండు జీవితాలు
- 2 నెలల్లో 10 మందిని మింగిన కడలి
- కొరవడిన నిరంతర పర్యవేక్షణ

మొగల్తూరు, మే 8(ఆంధ్రజ్యోతి): సముద్రం స్నానానికి అనువుగా లేకున్నా ఉవ్వెత్తున ఎగసి పడుతున్న అలలను చూసి సందర్శకులు ఉత్సాహపడుతున్నారు. అలలకు ఎదురెళ్లడంతో మృత్యుఘోష వినిపిస్తోంది.

రెండు నెలల్లో పది మంది మృత్యువాత

సముద్ర స్నానానికి దిగిన వారిలో యువకులు ఎక్కువగా మృత్యువాత పడుతున్నారు. గత ఏడేళ్లలో అలల ఉధృతికి కొట్టుకుపోయినవారిలో 50 మంది పైగానే మృత్యువాత పడ్డారు. 2015లో ఆరుగురు, 2016లో ఇద్దరు, 2017లో ముగ్గురు, 2018లో ఎనిమిది మంది, 2019లో ఐదుగురు, 2020లో ముగ్గురు, 2021లో నలుగురు, 2022లో నలుగురు, 2023లో ముగ్గురు, 2024లో నలుగురు మృతి చెందారు. గత రెండు నెలల్లో పది మంది యువకులు గల్లంతై మృతి చెందినట్టు పోలీస్ రికార్డుల్లో నమోదైంది.

19 కిలో మీటర్ల తీర ప్రాంతం

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 19 కిలో మీటర్ల సాగర తీరం మొగల్తూరు, నరసాపురం మండలాల్లో ఉంది. మొగల్తూరు మండలం పేరుపాలెం, కేపీ.పాలెం తీర ప్రాంతంలో కొబ్బరి, సరుగుడు తోటలతో పాటు ఆలయాలు వెలిశాయి. సందర్శకుల సంఖ్య పెరిగి ఈ రెండు గ్రామాల తీరంలో పర్యాటక శోభ సంతరించుకుంది. కేపీ.పాలెంలో మూడు దశాబ్దాల క్రితం క్రైస్తవుల ఆరాధ్యదేవత వేళాంకిణి మాత ఆలయాన్ని నిర్మించారు. అనంతరం వేంకటేశ్వర స్వామి, రుక్మాబాయి సమేత పాండురంగస్వామి, మోళ్లపర్రులో 54 అడుగుల అభయాంజనేయస్వామి, షిరిడీ సాయి ఆలయం,

మిగతా 8వ పేజీలో

కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేశాం

పేరుపాలెం బీచ్‌లో కంట్రోల్‌రూమ్ ఏర్పాటుచేసి సిబ్బందిని అందుబాటులో ఉంచుతున్నాం. వారాంతపు సెలవులు, పండుగ రోజుల్లో ఎక్కువ మంది సిబ్బంది తీరంలో బందో బస్త్ విధులు నిర్వహిస్తున్నారు. సముద్ర స్నానానికి దిగే వారికి అవగాహన కల్పించి రక్షణ చర్యలు తీసుంటున్నా ప్రమాదాలు జరుగుతున్నాయి. అంతర్వేది మెరైన్ పోలీసులు తీరం వెంబడి హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేసి సందర్శకులను అప్రమత్తం చేశారు.

- జి.వాసు, ఎస్ఐ మొగల్తూరు



గవర్నర్ అబ్దుల్ నజీర్ నుంచి అవార్డులు అందుకుంటున్న కలెక్టర్లు నాగరాణి, ప్రశాంతి

రెడ్ క్రాస్ సేవలకు కలెక్టర్లకు అవార్డులు

భీమవరం టౌన్/ రాజమహేంద్రవరం, మే 8 (ఆంధ్రజ్యోతి): విపత్కర పరిస్థితుల్లో నిస్వార్థ సేవలందించడానికి ప్రతి ఒక్కరు ముందుండాలని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు. గత ఏడాది జిల్లాలో వరదల సమయంలో కలెక్టర్ అందించిన సేవలకు గుర్తింపుగా రెడ్‌క్రాస్ అవా ర్డుకు ఎంపికయ్యారు. విజయవాడ రాజ్ భవన్‌లో గురువారం నిర్వహించిన ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవ కార్యక్రమాల్లో గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ నుంచి అవార్డు, బంగారు పతకాన్ని కలెక్టర్ నాగరాణి అందుకున్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యకలాపాలకు విస్తృత స్థాయిలో ప్రచారం కల్పించడం, ప్రజా ప్రయోజనాలకు సొసైటీ సేవలను సమర్థవంతంగా వినియోగించడంతో తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతికి రెడ్‌క్రాస్ సొసైటీ పురస్కారం దక్కింది. 2022-23లో పశ్చిమ గోదావరి కలెక్టర్‌గా విధులు నిర్వర్తించిన సమ యంలో సొసైటీ కార్యకలాపాలను చురుగ్గా అమలు చేయడంతో ఈ అవార్డుకు ఆమె ఎంపి కయ్యారు.

పరిశ్రమల స్థాపనతో నిరుద్యోగులకు ఉపాధి

ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్

పట్టాయగూడెంలో పారిశ్రామికవాడకు శంకుస్థాపన

చింతలపూడి, మే 8 (ఆంధ్రజ్యోతి) : పరిశ్రమల స్థాపన ద్వారా ఆ ప్రాంతం అభివృద్ధి చెందడమే కాకుండా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్ అన్నారు. మండలం లో పట్టాయగూడెంలో పారిశ్రామికవాడకు గురువారం సాయంత్రం శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ పట్టాయగూడెంలో 69.50 ఎకరాల్లో రూ.13.50 కోట్ల వ్యయంతో పారిశ్రామి కవాడ అభివృద్ధి జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ మాట్లాడుతూ చింత లపూడి నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంద న్నారు. కలెక్టర్ వెట్రిసెల్వి, జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ, నియోజకవర్గ టీడీపీ నాయకుడు జగ్గవరపు ముత్తారెడ్డి, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.



శంకుస్థాపనలో పాల్గొన్న ఎంపీ మహేశ్ కుమార్, ఎమ్మెల్యే రోషన్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, కలెక్టర్ వెట్రిసెల్వి



జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవనంలో ట్రాన్స్ జెండర్స్‌కు అవగాహన కల్పిస్తున్న ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాదర్శి కె.రత్నప్రసాద్

హిజ్రాలకు సమాన హక్కులు కల్పించాలి

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి రత్నప్రసాద్

ఏలూరు క్రైం, మే 8 (ఆంధ్రజ్యోతి): సమాజంలో స్త్రీ, పురుషులతో సమానంగా హిజ్రాలకు కూడా సమానహక్కులను కల్పించా ల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని అందరితో సమానంగా సంక్షేమ పథకాలను అందించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె రత్న ప్రసాద్ అన్నారు. ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలో డీఎల్ఎస్ఏ భవనంలో ట్రాన్స్‌జండర్స్‌కు అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. ఈ కార్య క్రమంలో పాల్గొన్న జడ్జి రత్న ప్రసాద్ మాట్లాడుతూ ట్రాన్స్‌జండర్స్ చట్టాలపై అవగాహన పెంచుకుని ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరికి చట్టాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత జిల్లా న్యాయసేవాధికార సంస్థపై ఉందని దీనిలో భాగంగానే హిజ్రాలకు ఈ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామ న్నారు. రేషన్, వసతి, వైద్యం, తదితర సదుపాయలను హిజ్రాలకు ప్రభుత్వం ఏర్పాటు చేయాలన్నారు. సమాజంలో కొంత మంది ప్రజలు, అధికారులు వేధిస్తున్నారని వారి నుంచి రక్షణ కల్పించాలని హిజ్రాలు తమ దృష్టికి తీసుకువచ్చారని వారికి జిల్లా న్యాయసేవాధికార సంస్థ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల అదనపు డైరెక్టర్ బి రామ్‌కుమార్, చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పీఎస్‌వీ మునేశ్వరరావు, ట్రాన్స్ జండర్స్ పాల్గొన్నారు.

మత్స్య శాఖాధికారులపై విచారణకు ఆదేశం

కాకినాడ మే 8 (ఆంధ్రజ్యోతి): మత్స్య శాఖలో అధికారులుగా పనిచేస్తూ ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడిచిన పలువురిపై శాఖాపరమైన విచారణకు ఆదేశిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఏలూరు మత్స్య శాఖ జేడీగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన ఫణిశేఖర్, భీమవరం డిప్యూటీ డైరెక్టర్ తిరుపతయ్యలపై విచారణ చేపట్టాలని ఆదేశించింది. స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీకు చెందిన అడిషినల్ డెరెక్టర్ ఆఫ్ ఫిషరీస్‌కు విచారణ బాధ్యతలు అప్పగించింది. ప్రభుత్వ నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారనే అభియోగాలపై ఏలూరు మత్స్య శాఖ సూపరింటెండెంట్‌గా పని చేసి రిటైర్ అయిన దీనదయాల్‌పైనా శాఖాపరమైన విచారణకు ఆదేశించారు.ఆరుగురు అధికారులపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది.



నోవా కళాశాల వద్ద బైఠాయించి ఆందోళన చేస్తున్న పూర్వ విద్యార్థులు

సర్టిఫికెట్లు ఇవ్వడం లేదంటూ విద్యార్థుల ఆందోళన

జంగారెడ్డిగూడెం,మే 8 (ఆంధ్రజ్యోతి): వేగవరం నోవా కళాశాలలో డీఈడీ, బీఈడీ, బీపీఈడీ పూర్తి చేసిన పూర్వ విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని 32 మంది విద్యార్థులు కళాశాల వద్ద గురువారం ఆందోళన చేపట్టారు. జంగారెడ్డిగూడెం మండలం వేగ వరంలో 2016 నుంచి 2020 వరకు డీఈడీ, బీఈడీ, బీపీ ఈడీ పూర్తి చేసిన విద్యార్థులు పదో తరగతి, ఇంటర్ ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇచ్చి ఆయా ఉపాధ్యాయ కోర్సుల్లో చేరారు. వీరిలో చాలామంది తమ ఫీజులు మొత్తం చెల్లించారు. అలా చెల్లించిన వారికి కూడా తమ సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని సీహెచ్.అనూష, ఎస్.నాగలక్ష్మి, ఎ.గౌరేశ్వరి, జి.సాగర్ బాబు, పి.అవినాష్ తదితరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొద్ది రోజుల క్రితం జంగారెడ్డిగూడెం ఆర్డీవోకు ఫిర్యాదు చేయగా కళాశాల సిబ్బంది ఈ నెల 8 ఎనిమిదవ తేదీ గురువారం సర్టిఫికెట్లు ఇస్తామని చెప్పడంతో దూరప్రాంతాల నుండి గర్భిణులు, బాలింతలు తమ సర్టిఫికెట్లు కోసం వేగవరంలోని నోవా కళాశాలకు చేరుకున్నారు. అక్కడకు వచ్చిన తరువాత సిబ్బంది సరిగా సమాధానం చెప్పక పోవడం, ఫీజులు చెల్లిస్తేనే కానీ సర్టిఫికెట్లు ఇవ్వలేమని విజయవాడ యూనివర్శిటీకి వెళ్లి తెచ్చుకోండని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో వారంతా కళాశాల వద్ద బైఠాయించి ఆందోళన చేపట్టారు. దాదాపు ఏడు సంవత్సరాల తరు వాత ప్రభుత్వం మెగా డీఎస్సీ ప్రకటించిందని డిఎస్సీకి దరఖాస్తు చేసుకుందామంటే సర్టిఫి కెట్లు ఇవ్వడం లేదని సమయం కూడా మే 15తో పూర్తవుతుందని పలువురు మహిళలు కన్నీటి పర్యంతమయ్యారు. కళాశాల సిబ్బంది పట్టించుకోకపోవడంతో జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్రను ఆశ్రయించారు. విద్యాశాఖామంత్రి నారా లోకేష్ ఈ విషయంపై ప్రత్యేక దృష్టి పెట్టి తమకు న్యాయం చేయాలని బాధిత పూర్వ విద్యార్థులు కోరుతున్నారు.

పదో తేదీన సర్టిఫికెట్లు ఇస్తాం

నాయుడు దుర్గాప్రసాద్, కళాశాల ఇన్‌ఛార్జి

ఈనెల పదో తేదీ శనివారం పూర్వ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తాం. ఇంకా ఫీజులు చెల్లించవలసిన వారు తొమ్మిదో తేదీ లోగా చెల్లించాలి. ఇప్పుడు సర్టిఫికెట్ల కోసం వచ్చే వారంతా పది సంవత్సరాల క్రితం ఇక్కడ చదువు పూర్తి చేశారు. అప్పటి ప్రిన్సిపాల్స్ సిబ్బంది ఇప్పుడు పనిచేయడంలేదు. అందువల్ల కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయి. అందరికీ సర్టిఫికెట్లు అందజేస్తాం

చిన వెంకన్న కల్యాణానికి ఆహ్వానం

నేత్రపర్వం.. ధ్వజారోహణం.. సకల దేవతలకు పిలుపు

ద్వారకాతిరుమల, మే 8 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మాండనాయకుని బ్రహ్మోత్సవ వేడుకల సంబరం అంబరాన్నంటుతోంది. స్వామివారి కల్యాణం తిలకించేందుకు సకల చరాచర సృష్టికి, ముక్కోటి దేవతలకు ఆహ్వానం పలుకుతూ గురువారం రాత్రి జరిగిన ధ్వజారోహణ వేడుక భక్తజనకోటికి కన్నుల పండువైంది. ఇంద్రాది అష్టదిక్పాలకులు, సర్వ దేవతలు, దేవ గణాలను స్వాగతిస్తూ వేదమంత్రోచ్ఛరణలతో అర్చకులు శ్రీవారి ఆలయ ప్రాకారంలోని ధ్వజ స్తంభంపై గరుడపటాన్ని ఎగురవేశారు. అంతకు ముందు ఉదయం ఆలయంలో విశేష కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం ఆలయంలో విష్వక్సేనుని ఒక వాహనంపై ఉంచి అలంకరించి, డోలు, సన్నాయివాయిద్యాల నడుమ అర్చకులు పుట్టమన్ను తెచ్చారు. అంతకు ముందే ఆలయ యాగశాలలో ఏర్పాటుచేసిన పాలికల్లో పుట్టమన్నును పోసి అంకురార్పణను శాస్త్రోక్తంగా జరిపారు. అనంతరం గరుడపటాన్ని వెండి తొళక్క వాహనంలో ఉంచి ఆ తరువాత ఆలయంలో ధ్వజారోహణ నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో నేటి ఉదయం 7 గంటలకు సూర్యప్రభ వాహనంపై తిరువీధిసేవ 8-30 నుండి భజన సంకీర్తనలు. రాత్రి 7 గంటల నుంచి చంద్రప్రభ వాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తారు. గురువారం స్వామివారు మత్స్యావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.దశావతారాల్లో మొదటి అవతారం ఇది. శంఖు, చక్ర, గదాధారియై ఉన్న చిన్న తిరుమలేశుని పలువురు భక్తులు దర్శించుకున్నారు.



ధ్వజపటానికి హారతి ఇస్తున్న అర్చకుడు

తొలి తప్పుగా వదిలేయండి!

వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శికి అభ్యర్థన

కఠిన చర్యలేవీ తీసుకోబోమని హామీ ఇచ్చారని 'ఏపీ-హంస' నాయకుల వెల్లడి

ఏలూరు అర్బన్, మే 8 (ఆంధ్రజ్యోతి) : ముఖ గుర్తింపు ఆధారిత హాజరు (ఎఫ్ఆర్ఎస్) నమోదులో ట్యాంపరింగ్‌కు పాల్పడ్డారనే అభియోగాలపై రాష్ట్రవ్యాప్తంగా పీహెచ్‌సీలు, ఇతర ఆసుపత్రుల్లో పనిచేస్తున్న 224 మంది వైద్యాధికారులు, ఎంఎల్ హెచ్ పీలు, ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషి యన్లపై క్రమశిక్షణ చర్యలు తీసుకునేందుకు ఇటీవల ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్ జారీ చేసిన ఉత్తర్వుల అమలును నిలిపివేయా ల్సిందిగా అభ్యర్థిస్తూ ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీ-హంస) రాష్ట్ర అధ్యక్షుడు అరవపాల్ గురువారం అమరావతి సెక్రటేరియట్‌లో వైద్యశాఖ ఉన్నతాధికారులను కలుసుకుని వినతిపత్రం అందజేశారు. ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో రాష్ట్రంలో వైద్యశాఖ తరఫున చేపట్టాల్సిన ముందస్తు ఏర్పాట్లపై సచివాలయంలో వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు అధ్యక్షతన జరిగిన ఉన్నతస్థాయి సమావేశం సందర్భంగా తమ అభ్యర్థనను ఉన్నతాధికారులకు నివేదించినట్లు వివరించారు. తమ వినతిపై సానుకూలంగా స్పందించిన ముఖ్యకార్యదర్శి కృష్ణబాబు ఆయా శాఖల హెచ్‌వోడీలకు అక్కడికక్కడే మౌఖిక ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. సాంకేతికలోపం వల్లే ఎఫ్ఆర్ఎస్ హాజరు నమోదులో అవాంఛనీయ పరిణామాలు చోటు చేసుకున్నాయని, ఉద్యోగులెవరూ ఉద్దేశపూర్వకంగా ట్యాంపరింగ్ చేయలేదని కృష్ణబాబుకు వివరించామన్నారు.తొలి తప్పుగా పరిగణించి కఠిన చర్యలేవీ చేపట్టవద్దని కోరామన్నారు. ఎఫ్ఆర్ఎస్ హాజరు యాప్‌లో లోపాలను సరిదిద్దాలని, ఇకమీదట ఇలా జరుగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని హామీ ఇచ్చామన్నారు. ఈ నేపథ్యంలో సమావేశంలో అక్కడేవున్న వైద్య శాఖలోని మూడు ప్రధానవిభాగాల హెచ్‌వో డీలతో మాట్లాడిన ముఖ్యకార్యదర్శి కఠిన చర్యలేవీ మెడికల్ ఆఫీసర్లు, ఉద్యోగులపై చేపట్టవద్దని మౌఖిక ఆదేశాలిచ్చారని తెలిపారు. పూర్తిస్థాయిలో లిఖితపూర్వక ఉత్తర్వులు శుక్రవారం విడుదలవుతాయని సంఘ వ్యవస్థాపకుడు కె.యోగేశ్వర రెడ్డి, జిల్లా నాయకుడు ఆనంద్ వివరించారు. కాగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 8మంది పీహెచ్‌సీల వైద్యాధికారులు, ఒక ఎంఎల్ హెచ్‌పీ, ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఒక ఫార్మసిస్టు ఐఫోన్లను ఉపయోగించి టైం, డేట్ సెట్టింగ్‌లను సెట్టింగ్ చేసి ట్యాంపరింగ్ చేయడం ద్వారా హెల్త్ ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో హాజరు నమోదుచేసినట్టు గత నెల 10న స్టేట్ నోడల్ ఆఫీసర్ గుర్తించి, వారిపై క్రమశిక్షణ చర్యలకు ఆదేశించిన విషయం తెలిసిందే. వీరిలో జిల్లాలో ఎఫ్ఆర్ఎస్ హాజరు నమోదును డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి రోజూ పర్యవేక్షించే నోడల్ అధికారికూడా ఉండటం విశేషం.

ముగ్గురిపై కేసు నమోదు

ఏలూరు క్రైం, మే 8 (ఆంధ్రజ్యోతి) : ఒక యువతిని ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసగించిన యువకునితో పాటు అతని తల్లిదండ్రులపై కూడా ఏలూరు మహిళా పోలీసులు కేసు నమోదు చేశారు. జిల్లాలోని ఓ ప్రాంతానికి చెందిన యువతిని గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన సాధు వెంకట అక్షయ్ ప్రేమించాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి వివాహేతర సంబంధం కొనసాగించాడు. అంతేకాకుండా ఆమెను పెళ్లి చేసుకుంటానని అతని తల్లి ఇందిరరాణి, తండ్రి నరసింహుడు కలిసి సంబంధం మాట్లాడుకున్నారు. ఆ తరువాత నిరాకరించారు. దీంతో ఆ ముగ్గురిపై బాధితురాలు ఫిర్యాదు చేయడంతో మహిళా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పోక్సో కేసు నమోదు

భీమవరం క్రైం, మే 8 (ఆంధ్రజ్యోతి) : 6వ తరగతి చదువుతున్న బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఒక వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు భీమవరం టూటౌన్ ఎస్ఐ రెహ్మాన్ తెలిపారు.పట్టణంలోని బలుసుమూడి ప్రాంతానికి చెందిన బాలిక సెలవులు కావడంతో రోడ్డుపై ఆడుకుంటున్నది. అయితే ఆ ఇంటి పక్కనే ఉన్న 55 ఏళ్ళ వ్యక్తి ఆ బాలికను మాయ మాటలు చెప్పి ఇంట్లోకి తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అప్పుల బాధతో ఆత్మహత్య

పెదవేగి, మే 8(ఆంధ్రజ్యోతి) : అప్పులబాధ తట్టుకోలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్టు పెదవేగి ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపారు. పెదకడిమి గ్రామానికి చెందిన నెర్సు రాటాలు సాగులో నష్టం వచ్చి, అప్పులపాలయ్యాడు. చేసిన అప్పులు తీర్చలేనేమోననే ఆందోళనతో మంగళవారం పురుగుమందు తాగాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాటాలు (40) బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుని తండ్రి జమలయ్య ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

పంచాయతీ ఉద్యోగిపై దాడి

ఉండి, మే8(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఉద్యోగిపై దాడి చేసి గాయపరిచిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఉండి పోలీసులు తెలిపారు. పాందువ్వ గ్రామపంచాయతీలో ట్యాంక్ వాచర్‌గా పనిచేస్తున్న హనుమంతు కృష్ణారావును ఈనెల 7వ తేదీ మధ్యాహ్నం అదే గ్రామానికి చెందిన ఆరవెల్లి నరసన్న అనే వ్యక్తి ఇంటిపన్ను విషయంలో ఘర్షణపడి దాడి చేసి గాయపరిచినట్లు గురువారం పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఉండి ఎస్ఐ నజీరుల్లా తెలిపారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు,రమాదేవి దంపతులు

కనుల పండువగా కాళ్లకూరు వెంకన్న కల్యాణం

కాళ్ళ, మే 8 (ఆంధ్రజ్యోతి) : కలియుగ దైవం కాళ్ళకూరు వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం గురువారం కన్నుల పండువగా జరిగింది. పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెల అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా గ్రామంలో స్వామివారికి గరుడ సేవ నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో గాజువాకకు చెందిన కాండూరి వెంకట రమణాచార్యులుచే దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో వేద పండితులు, ఆలయ అర్చకులు కల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిపారు. డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు, రమాదేవి దంపతులు కల్యాణ పూజల్లో పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. ఈవో ఎం.అరుణ్‌కుమార్, ఆలయ అధికారులు, అర్చకులు, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.



కల్యాణం వీక్షిస్తున్న కలెక్టర్ తదితరులు



వేంకటేశ్వరస్వామికి ఎమ్మెల్యే అంజిబాబు చేతుల మీదుగా కిరీటం అందిస్తున్న దాతలు

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం

భీమవరం టౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి) : భీమవరం జేపీ రోడ్డులో శ్రీపద్మావతి వేంకటేశ్వరస్వామి ఆలయంలోని స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలను గురువారం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) ప్రారంభించారు. ఆలయ ప్రాంగణంలో ఉత్సవ విగ్రహాలకు పంచామృతాలతో సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలను నిర్వహించారు. స్వామివారిని, అమ్మవారిని పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెగా అలంకరించారు. అనంతరం 108 కలశాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారికి, అమ్మవారికి చందన అలంకరణ చేశారు. 10వ తేదీ రాత్రి 7 గంటలకు స్వామివారి కల్యాణం జరుగుతుందని ఈవో ముదునూరి సత్యనారాయణ రాజు, చైర్మన్ మంతెన రామ్‌కుమార్ రాజు తెలిపారు కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ స్వామివారికి ముత్యాల తలంబ్రాలు, ఎమ్మెల్యే అంజిబాబు దంపతులు పట్టు వస్త్రాలను అందిస్తారని తెలిపారు.

వెండి కిరీటం అందజేత :

స్వామి వారికి దాతలు రెండున్నర కిలోల వెండి కిరీటాన్ని అందించారు. కాకులపాటి వీర రాఘవరావు దంపతులు ప్రత్యేకంగా తయారు చేయించిన వెండి కిరీటాన్ని ఎమ్మెల్యే అంజిబాబు చేతుల మీదుగా అందించారు. జనసేన పట్టణ అధ్యక్షుడు చెనమల్ల చంద్రశేఖర్, బండి రమేష్ కుమార్, వబిలిశెట్టి రామకృష్ణ, కారుమూరి సత్యనారాయణ మూర్తి, తదితరులు పాల్గొన్నారు



అమ్మవారికి దాతలు అందించిన అగ్గిపెట్టెలో చీర

శాంతి భద్రతల పరిరక్షణే ప్రథమ కర్తవ్యం

వార్షిక తనిఖీలో ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్

భీమవరం క్రైం, మే 8 (ఆంధ్రజ్యోతి) :జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నివారణే లక్ష్యంగా జిల్లాలోని ప్రతి ఒక్క పోలీసు అధికారి, సిబ్బంది విధులు నిర్వర్తించాలని ఏలూరు రేంజ్ ఐజి జీవీజీ అశోక్‌కుమార్ ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం భీమవరంలో జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి విచ్చేసిన ఆయనకు జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, ఇతర పోలీసు అధికారులు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఐజీ సాయుధ బలగాల గౌరవ వందనం స్వీకరించి కార్యాలయ పరిసరాలను పరిశీలించారు. తర్వాత కార్యాలయ ప్రాంగణంలో గల డిస్ట్రిక్ట్ క్రైం రికార్డ్ బ్యూరో (డీసీఆర్‌బీ), డిస్ట్రిక్ట్ స్పెషల్ బ్రాంచ్, ఫింగర్ ప్రింట్, ఆర్మ్‌డ్ రిజర్వ్, జిల్లా పోలీసు కార్యాలయ వివిధ పరిపాలన విభాగాలలో వార్షిక ప్రగతి నివేదికలను క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పోలీసు అధికారులతో జిల్లాలో శాంతి భద్రతలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో కీలకమైన పెండింగ్ కేసులు, పాత నేరస్తులు, సస్పెక్ట్ షీట్స్ తదితర అంశాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా అదనపు ఎస్పీ వి.భీమారావు, భీమవరం డీఎస్పీ ఆర్.జయసూర్య, నరసాపురం డీఎస్పీ జి.శ్రీవేద, తాడేపల్లిగూడెం సబ్ డివిజన్ డీఎస్పీ డి.విశ్వనాథ్, ట్రైనీ డీఎస్పీ కె.మానస పాల్గొన్నారు. ఏలూరులోని పెద్ద రైల్వేస్టేషన్‌లో ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా తనిఖీలు చేసినట్టు ఐజీ తెలిపారు. తనిఖీల్లో ఎస్పీ కిశోర్, డీఎస్పీ శ్రావణ్‌కుమార్‌లు పాల్గొన్నారు



పోలీసు అధికారులతో సమీక్షిస్తున్న ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్

35 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం

ముగ్గురిపై కేసు

ఏలూరు క్రైం/పెనుగొండ, మే 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజా పంపిణీకి సంబంధించిన బియ్యాన్ని అక్రమ మార్గంలో తరలిస్తుండగా విజిలెన్సు అధికారులు తనిఖీలు చేసి 35 క్వింటాళ్ల బియ్యం, వ్యాన్‌ను స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేశారు. విజిలెన్సు సీఐ పి.శివరామకృష్ణ, పెనుగొండ సివిల్ సప్లై రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, రెవెన్యూ అధికారులు కలిసి పెనుగొండ మండలం సిద్ధాంతం జంక్షన్ వద్ద గురువారం వాహనాల తనిఖీలు చేపట్టారు. అశోక్ లేలాండ్ వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా ఆ వ్యానులో 35 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అలాగే వ్యాన్‌ను కూడా సీజ్ చేసినట్లుగా తెలిపారు. వాహన యజమాని, డ్రైవర్ అయిన కొర్లేపర మణికంఠను ప్రశ్నించగా అతను ఆ బియ్యం తణుకు పరిసర ప్రాంతాల్లో తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్న ఎన్‌వి రామకృష్ణ వద్ద కొనుగోలు చేసి వాటిని అధిక ధరకు నర్సిపూడికి చెందిన ఉండమట్ల మణికంఠకు అమ్ముతున్నట్లుగా తెలిపారు. ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లుగా విజిలెన్సు అధికారులు తెలిపారు.



బియ్యం వ్యాన్‌ను పట్టుకున్న అధికారులు

ఇద్దరు సైబర్ నేరస్థుల అరెస్టు

నరసాపురం టౌన్, మే 8(ఆంధ్రజ్యోతి): సైబర్ క్రైం కేసులో అంతర్ రాష్ట్ర ముఠాలోని ఇద్దరిని అరెస్టు చేసినట్లు సీఐ యాదగిరి చెప్పారు. గురువారం సీఐ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గత ఏడాది నవంబర్ నెలలో పట్టణానికి చెందిన మెడికల్ షాపు నిర్వాహకుడు స్టాక్ మార్కెట్ కోసం గుగూల్‌లో వెతికాడన్నారు. గుగూల్ ఓపెన్ చేయగానే గుర్తు తెలియని వాట్సప్ నుంచి ఆన్‌లైన్ ట్రేడింగ్ చేయాలంటే తాను చెప్పిన గ్రూప్‌లో చేరాలని నమ్మ బలికాడన్నారు. ఈ గ్రూప్‌లో చేరిన బాధితుడు పలు దఫాలుగా సుమారు రూ.54లక్షలు డిపాజిట్ చేసినట్లు సీఐ చెప్పారు. పెట్టుబడి పెట్టిన సొమ్ము తిరిగి రావాలంటే రూ. 1.67కోట్లు కట్టాలని నేరగాళ్లు బాధితుడికి చెప్పారన్నారు. దీంతో బాధితుడు మోస పోయినట్లు గ్రహించి గత ఏడాది నవంబర్ 11న పోలీసులకు ఫిర్యాదు చేశాడన్నారు. దర్యాప్తు చేపట్టిన సీఐ ఈనెల 5న వెస్ట్ బెంగాల్ కోల్‌కతాకు చెందిన సైబర్ నేరగాళ్లు దీపక్‌కుమార్, జె రాజేష్‌లను అరెస్టు చేసి కోల్‌కతా కోర్టులో హాజరుపర్చి నరసాపురం తీసుకొచ్చామ న్నారు. కేసును చేధించేందుకు కానిస్టేబుల్ ఎస్ చక్రవర్తి, ఈ.అబ్బాస్‌లను టీమ్‌లుగా ఏర్పాటు చేశామన్నారు. ఈకేసులో మిగిలిన నిందితులను త్వరలో పట్టుకుంటామని చెప్పారు. ఈసమావేశంలో ఎస్సై జయలక్ష్మి, సిబ్బంది వెంకట్, నరేంద్రగౌడ్ పాల్గొన్నారు.



నిందితులను అరెస్టు చేసి విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న సీఐ యాదగిరి

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య

భీమడోలు, మే 8 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసై ఒక వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భీమడోలు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భీమడోలు మండలం పోలసానపల్లి గ్రామానికి చెందిన కోటా రాము (45)కు వివాహం అయింది. ఇద్దరు పిల్లలు. కూలి పని చేస్తూ మద్యానికి బానిసై పనికి వెళ్ళకుండా వెసనపరుడుగా మారాడు. దీనిపై ఈనెల 8వ తేదీన భార్య మందలించిందని రేకుల షెడ్డుకు చీరతో ఉరి వేసుకుని మృతి చెందాడు. బంధువులు చూసి ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. భీమడోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి పేరుతో నమ్మించి డాక్టర్‌కే అబార్షన్

ఏలూరు క్రైం, మే 8 (ఆంధ్రజ్యోతి) : ప్రేమించి పెళ్ళిచేసుకుంటానని అబార్షన్లు చేయించి ఆపై పెళ్ళికి నిరాకరించి మరో యువతిని పెళ్ళిచేసుకోవడానికి పీటలపై కూర్చోడానికి సిద్ధపడిన ఒక డాక్టర్‌ను ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం.సుబ్బారావు గురువారం అరెస్టు చేశారు. ఒక ప్రైవేటు మెడికల్ కళాశాలలో ఒక యువతి డాక్టర్ చదివింది. ఈనెల 4వ తేదీన పరీక్షలు పూర్తి చేసుకుంది. ఆమెతోపాటే పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం శ్రీనివాస్‌నగర్‌కు చెందిన భవనం రమణారెడ్డి రేడియోలజీ చదివారు. వారిద్దరూ క్లాస్ మేట్స్ కావడంతో ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకుంటానని ఆ యువతిని నమ్మించి వివాహేతర సంబంధం కొనసాగించారు. అబార్షన్లు కూడా చేయించారు. పెళ్లికి నిరాకరించి మరో యువతిని ఈనెల 11వ తేదీన పెళ్లి చేసు కోవడానికి సిద్ధపడ్డాడు. దీంతో బాధితురాలు ఏలూరులోని మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీఐ సుబ్బారావు కేసు నమోదు చేసి యువతిని మోసగించిన డాక్టర్ భవనం రమణారెడ్డిని గురువారం అరెస్టు చేశారు.

29న జాతీయ సమ్మె జయప్రదం చేయాలి

పెంటపాడు, మే 8(ఆంధ్రజ్యోతి): పలు డిమాండ్ల సాధన కోసం ఈనెల 29న నిర్వహించే జాతీయ సమ్మెలో ఉపాధి కూలీలందరూ పాల్గొని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు చిర్లా పుల్లారెడ్డి, కండెల్లి సోమరాజు కోరారు. గురువారం అలంపురంలో ఉపాధి కూలీలతో వారు మాట్లాడారు. ఉపాధి కూలీలకు కనీస వేతనం రూ.6000 ఇవ్వాలని, పనిదినాలు 200 రోజులు చేయాలని బడ్జెట్లో రూ.2.40లక్షల కోట్లు కేటాయించాలని తదితర డిమాండ్లు చేశారు. ఆకుల రామారావు తదితరులు పాల్గొన్నారు.

కాళీపట్నం భూముల్లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తనిఖీ



మొగల్తూరు, మే8(ఆంధ్రజ్యోతి): కాళీపట్నం రెవెన్యూ గ్రామ పరిధిలోని భూములను గురువారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బీఎస్ నారాయణ రెడ్డి తనిఖీ చేశారు. కోనేరు రంగారావు కమిటీ ఆధ్వర్యంలో గల భూములను ఆయన క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. తహసీల్దార్ రాజ్‌కిషోర్, సిబ్బంది ఉన్నారు.



సోమాలమ్మను దర్శించుకుంటున్న బొలిశెట్టి శ్రీనివాస్

హిందూ ధర్మ పరిరక్షణకు ముందుంటా : బొలిశెట్టి

తాడేపల్లిగూడెం రూరల్, మే 8(ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, తానెప్పుడూ ముందుంటానని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. దండగర్ర శివారు లింగారాయుడు గూడెంలో నూతనంగా ఏర్పాటుచేసిన సోమాలమ్మ ఆలయ ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం నిర్వహించారు. ఆయనతో పాటు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి వేర్వేరుగా అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణ సాయంగా రూ.15వేలను ఎమ్మెల్యే శ్రీనివాస్ నిర్వాహకులకు అందించి, అన్నదానం చేశారు. ఉపసర్పంచ్ కాసాని రాంబాబు, జనసేన గ్రామ అధ్యక్షుడు అంతర్వేది నరసన్న, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మునిసిపల్ ఆర్‌వోగా రంగారావు బాధ్యతలు



భీమవరంటౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి):మునిసిపాల్టీలో మునిసిపల్ రెవెన్యూ అధికారిగా బి.రంగారావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఆయన గిద్దలూరు నగర పంచాయతీలో విధులు నిర్వర్తిస్తూ ఇక్కడకు వచ్చారు ఆయన మర్యాదపూర్వకంగా కమిషనర్ కె. రామచంద్రారెడ్డిని కలిశారు.

బాధితులను ఆదుకునేందుకే 'రెడ్ క్రాస్'

భీమవరంటౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి) : యుద్ధాలు, ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు బాధితులను ఆదుకుని ఆసరాగా నిలవడం కోసం రెడ్‌క్రాస్ సొసైటీ అనే సేవా సంస్థ ఏర్పాటైందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, ఏఎంసీ మాజీ చైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు అన్నారు. రాయలంలోని ఇండియన్ రెడ్ క్రాస్ కార్యాలయంలో గురువారం శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవాన్ని, రెడ్‌క్రాస్ సొసైటీ వ్యవస్థాపకుడు జాన్ హెన్రీడూనా హంట్ జయంతిని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలను రక్షిస్తూ శాంతిని పెంపొందించడమే రెడ్ క్రాస్ సంస్థ లక్ష్యమన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, గోపిశెట్టి మురళీకృష్ణ మాట్లాడుతూ రెడ్ క్రాస్ ప్రపంచ వ్యాప్తంగా సేవలు అందిస్తుందని, రక్తదానం చేయడానికి దాతలు ముందుకు రావాలన్నారు. అనంతరం పలువురు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందించి సత్కరించారు. కొత్తపల్లి విజయ్‌కుమార్ రాజు, గోకరాజు లక్ష్మణరాజు, కొప్పినిడి బాబీ, రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.



ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న దాతలు

రామలింగేశ్వరస్వామి ఆలయానికి రూ2,01,116 విరాళం

భీమవరంటౌన్, మే 8(ఆంధ్రజ్యోతి): శ్రీరాంపురంలోని రామలింగేశ్వర స్వామి ఆలయం పునఃప్రతిష్ఠ నిమిత్తం భీమవరం పట్టణానికి చెందిన కేసీ బుక్ డిపో స్టేషనరీ యజమానులు మహేంద్ర కుమార్‌జైన్, దినేష్ కుమార్ జైన్ సురేష్‌కుమార్ జైన్ రూ.2,01,116 విరాళాన్ని దేవాలయ నిర్మాణ కమిటీ వారికి చెక్కు రూపంలో అందించారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు గాదిరాజు సుబ్బరాజు, పొత్తూరి బాపిరాజు, చనమల చంద్రశేఖర్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు వబిలిలిశెట్టి ప్రసాదరావు, సరిపిడకల రామారావు, గుండు రమణ, మొవ్వ శంకర్, సంఘ సేవకులు అల్లు శ్రీనివాసులు పాల్గొన్నారు.

రైతులకు నవధాన్యాల విత్తనాలు పంపిణీ

నరసాపురం రూరల్, మే 8(ఆంధ్రజ్యోతి): పంట భూములను బలోపేతం చేసేందుకు 45 మంది రైతులకు నవధాన్యాల విత్తనాల కిట్లను కేవీకే కో-ఆర్డినేటర్ డాక్టర్ మల్లికార్జునరావు, వ్యవసాయశాఖ ఏడీఏ డాక్టర్ అనిల్‌కుమారి అందజేశారు. నవరసపురం గ్రామంలో గురువారం కేవీకే ఉండి ఆధ్వర్యంలో ఎస్సీ సబ్‌ప్లాన్‌లో భాగంగా 25మంది రైతులకు కొబ్బరిలో ఆశించే రైనోసిరాస్ (కొమ్ముపురుగు) నివారణకు బకెట్ ట్రాప్స్ బాటిల్‌ను అందించారు. సర్పంచ్ నవజీవన్‌రావు, శాస్త్రవేత్తలు వినయలక్ష్మి, హిమబిందు, రైతులు పాల్గొన్నారు.

కాలువల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

పాలకోడేరు, మే 8(ఆంధ్ర జ్యోతి): కాలువల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని, డిప్యూటీ స్పీకర్ రాఘురామ కాలువల ప్రక్షాళనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని, ఆయన సూచనలతోనే అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని జిల్లా డెల్టా ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ కునాథరాజు మురళీకృష్ణంరాజు అన్నారు. గొరగనమూడి, పెన్నాడ గ్రామాల్లో కాలువల ప్రక్షాళన పనులను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మొత్తం రూ.9.50 లక్షలతో చేపట్టిన పనులు పూర్తయితే తాగు,సాగునీటికి ఇబ్బందులు ఉండవన్నారు. సర్పంచ్ గొట్టుముక్కల శివాజీరాజు, చిల్లా అనూష సత్యనారాయణ, తాడేరు నీటి సంఘం ఉపాధ్యక్షుడు ఆరేపల్లి వెంకట్రావు, మోగల్లు నీటి సంఘం అధ్యక్షులు కొత్తపల్లి సూర్యనారాయణరాజు, ఏఈ వెంకటేశ్వరరావు, నీటి సంఘం డైరెక్టర్లు, మెంబర్లు పాల్గొన్నారు.

మృత్యుఘోష

(5వ పేజీ తరువాయి)

దశావతార మత్యనారాయణస్వామి ఆలయాల నిర్మాణంతో తీర ప్రాంతం ఆధ్యాత్మిక చింతనకు నెలవుగా ఉంది. ఏటా మే నెలలో నాలుగు రోజులు పాటు వేళాంకిణి మాత ఉత్సవాలు, గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా జరుగుతాయి. కార్తీక మాసంలో వేంకటేశ్వరస్వామి కల్యాణం, పాండురంగస్వామి కల్యాణం నిర్వహిస్తున్నారు. దీనితో ఇక్కడి తీర ప్రాంతంలో సౌకర్యాలు లేకపోయినా, సముద్ర స్నానానికి అనువుగా లేకున్నా సందర్శకులు తరలివస్తున్నారు. కార్తీక మాసంలో నెల రోజులు పాటు వేలాది మంది పర్యాటకులు సముద్రస్నానం చేసి, ఆలయాలను దర్శించుకుని కొబ్బరి, సరుగుడు తోటల్లో వన భోజనాలు చేస్తుంటారు. ఏటా వేలాది మంది భక్తులు వస్తున్నా సౌకర్యాలు అంతంత మాత్రం.

కన్నీటి కడలి

సముద్రంలో స్నానానికి దిగి గల్లంతై విగత జీవులుగా కొట్టుకువచ్చిన వారి బంధువుల వేదన వర్ణనాతీతం. ప్రాణాలతో పాటు అయినవారి కన్నీరు సైతం కడలిలో కలుస్తోంది. తల్లితండ్రులకు ఆసరాగా నిలవాల్సిన యువకులు అలల ఉధృతిలో కొట్టుకుపోయి కడలిలో కలిసిపోతున్నారు. చేతికి అందివచ్చిన తనయుల కట్టె కడలి ఒడ్డున తేలడంతో బాధిత కుటుంబం బరువెక్కిన హృదయాలతో వెనుదిరుగుతున్నారు.

పేరుపాలెం తీరం అనువు కాదు

సముద్రంలో దిగిన వారి పాదం కింద భాగంలో గొయ్యి కింద ఏర్పడుతుంది. నీటితో కలిసిన ఇసుకలో పాదం మోపగానే కాలి కింద ఇసుక కోతతో నెమ్మదిగా ఒరిగిపోవడం సహజం. అదే అనుభూతితో చాలా మంది ఉత్సాహంగా చిందులేస్తారు. అయితే మద్యం మత్తులో ఉన్నవారు బ్యాలెన్స్ చేసుకోలేక అలల ఉధృతికి కొట్టుకుపోతారు. అంతేకాదు స్నేహితులతో బంతి ఆటలు, పరుగులతో కొందరు అలలల కౌగిలికి చిక్కుతారు. కార్తీక మాసంలో మాత్రమే రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పర్యవేక్షణ, గజ ఈత గాళ్లను ఉంచి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపడతారు. మిగిలిన రోజుల్లో పర్యవేక్షణ కొరవడుతోంది. సముద్రం వద్దకు వచ్చిన పలువురు యువకులు తీరం వెంబడి బైక్ విన్యాసాలు, మద్యపానం, ఆడపిల్లలతో ఆకతాయి పనులతో సరదా చేస్తున్నారు. కార్తీక మాసం మినహా మిగిలిన రోజుల్లో అడ్డు అదుపు లేకపోవడంతో యువకులు మరింత స్వేచ్ఛగా వ్యవహరించడంతో ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. పుట్టిన రోజు, కాలేజీలు సెలవు రోజుల్లో బీచ్‌కు వచ్చి ప్రమాదాల బారిన పడుతున్నారు.







క్విట్ ఇండియా స్తూపం వద్ద హర్షం ప్రకటిస్తున్న ప్రముఖులు.. పాలకొల్లులో బీజేపీ పట్టణ నాయకులు.. తాడేపల్లిగూడెంలో మాట్లాడుతున్న అయినంపూడి శ్రీదేవి

ఉగ్రవాదాన్ని అణిచివేద్దాం

- భీమవరం క్విట్ ఇండియా స్తూపం వద్ద ఆపరేషన్ సిందూర్ విజయంపై పలువురు వక్తల హర్షం

భీమవరంటౌన్, మే 8(ఆంధ్రజ్యోతి): 'ఉగ్రవాదాన్ని అణిచివేద్దామని, భారత్ కన్నెర్ర చేస్తే ఉగ్రవాదం తోక ముడుచుకోవాల్సిందేనని ప్రధాని మోదీ నిరూపించారని, ఉగ్రవాదుల వ్యతిరేక పోరాటంలో భారత్ చరిత్రాత్మకంగా నిలిచింది' అని పలువురు వక్తలు అన్నా రు. భీమవరం క్విట్ ఇండియా స్తూపం వద్ద శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో గురువారం ఆపరేషన్ సిందూర్ విజయంపై హర్షం తెలుపుతూ కార్యక్ర మాన్ని నిర్వహించారు. నరసాపురం పార్లమెంట్ బీజేపీ ఇన్‌ఛార్జి పేరిచర్ల సుభాష్‌రాజు, అల్లూరి సాయి దుర్గరాజు, కంతేటి వెంకటరాజు మాట్లాడుతూ ఉగ్రమూకలపై భారత్ రుద్ర తాండవం చేసిందన్నారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్‌కు భారత్ సైన్యం గట్టిగా బుద్ధి చెప్పిందన్నారు. చెరుకువాడ రంగసాయి, అరసవల్లి సుబ్రహ్మణ్యం, ఆరేటి ప్రకాశ్, ఉండపల్లి రమేష్‌నాయుడు మాట్లాడుతూ పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉగ్రవాద శిబిరాలపై భారత త్రివిధ దళాలు నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ సాహసోపేత చర్యగా నిలిచిందన్నారు. యూత్ క్లబ్ సభ్యులు కేఎస్ఎన్ రాజు, భట్టిప్రోలు శ్రీనివాసరావు, చల్లా రాము, కలిగొట్ల గోపాల శర్మ, అడవి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

- పెంటపాడు : పహల్గామ్‌లో ఉగ్రవాదులు చేసిన కిరాతక చర్యకు ప్రతీకారంగా భారత్ నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ పట్ల టీబీఆర్ సంస్థ ఛైర్మన్ తనుబుద్ది భోగేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశ సైన్యం త్రివిధ దళాలు సంయుక్తంగా ఆపరేషన్ సిందూర్ పేరుతో పాకిస్థాన్ ఉగ్రవావుదల స్థావరాలపై దాడులు నిర్వహించి ప్రతీ కారం తీర్చుకున్నారన్నారు.
- పాలకొల్లు అర్బన్: పాకిస్థాన్‌లో ఉగ్రస్థావరాలను నేలమట్టం చేయించడం హర్షనీయమని బీజేపీ పట్టణ నాయకులు అన్నారు. పట్టణ అధ్యక్షుడు కొల్లి కొండప్రసాద్, సీనియర్ నాయకులు ఉన్నమట్ల కపర్థి, జక్కంపూడి కుమార్, చెరుకూరి శ్రీనివాస్, మల్లవోలు సురేష్ తదితరులు గురువారం మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ సాహసోపేతమైన చర్య అన్నారు. ప్రధాని మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోమ్ మంత్రి అమిత్‌షాలను అభినందించారు.
- తాడేపల్లిగూడెం రూరల్ : పాకిస్థాన్‌కు ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ తగిన బుద్ది చెప్పిందని బీజేపి జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి పేర్కొన్నారు. తాడేపల్లిగూడెంలోని బీజేపి కార్యాలయం వద్ద బుధవారం నియోజకవర్గ ఇన్‌చార్జి ఈతకోట తాతాజి అధ్యక్షతన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతీ పౌరుడు పాక్‌పై యుద్ధానికి సిద్ధంగా ఉండాలన్నారు. బీజేపీ నాయకులు కర్రి బాలాజి, పెదపోలు వీరరాఘవులు, కొండపల్లి నగేష్, దువ్వ శ్రీను, మాట్లాడారు.

ఆర్మీకి అయ్యప్ప అనుగ్రహం ఉండాలి

తణుకు : భారత ఆర్మీకి అయ్యప్ప స్వామి అనుగ్రహం ఉండాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కోరారు. గురువారం బైపాస్ రోడ్డులోని శ్రీషాస్తా పంచాయతన అయ్యప్పస్వామి ఆలయంలో విశేష అన్నాభిషేకం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భారత్-పాక్ మధ్య యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో భారత ఆర్మీకి స్వామి అనుగ్రహం ఉండాలని పూజలు నిర్వహించారు. సైనికుల్లో ధైర్యసాహసాలను పెంపొందించేలా అభినందిం చాలని వివరించారు. ఆలయ గురు స్వామి చలపతి స్వామి, చల్లా భరణిలతోపాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.



ఆర్డీవోతో మాట్లాడుతున్న చినమిల్లిపాడు రైతులు

డి-ఫారం పట్టా భూములపై నిబంధనలు పాటించండి

ఆకివీడురూరల్, మే 8(ఆంధ్రజ్యోతి): డి-ఫారం పట్టా భూములు కొల్లేరు అభయారణ్యం పరిధిలో ఉన్నందున ప్రభుత్వ నింబంధనలు పాటించాలని ఆర్‌డీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆకివీడు మండలంలోని కొల్లేరు అభయారణ్యం పరిధిలో ఉన్న డి-ఫారం రైతులు గతంలో ప్రభుత్వం సాగు చేసుకునేందుకు అనుమతి ఇచ్చిందని, ప్రస్తుతం అధికారులు అడ్డుకుంటున్నారని రైతులు ప్రభుత్వానికి పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేయడంతో గురువారం భీమవరం ఆర్‌డీవో చినిమిల్లిపాడులో పర్యటించి విచారణ చేశారు. రైతులు తమ సమస్యలను ఆర్‌డీవోకు వివరించారు. భూములు అటవీశాఖ పరిధిలో ఉన్నందున ప్రభుత్వ నిబంధనలకు లోబడి వ్యవహరించాల్సి ఉంటుందని అన్నారు. తహసీల్దారు వెంకటేశ్వరరావు, ఆర్‌ఐ ఆంజనేయులు వీఆర్‌వో, రైతులు తదితరులున్నారు.



కేపీపాలెం సౌత్‌లో చేపట్టిన నీటి తొట్టెల నిర్మాణం

ఉపాధి నిధులతో నీటి తొట్టెల నిర్మాణం

మొగల్తూరు, మే 8(ఆంధ్రజ్యోతి) : వేసవిలో పశువుల దాహార్తిని తీర్చేందుకు నీటి తొట్టెల నిర్మాణాలు చేపట్టామని ఎంపీడీవో సీహెచ్ త్రిశూలపాణి గురువారం తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మండలంలో రెండు నీటి తొట్టెల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయన్నారు. మండలంలో పేరుపాలెం నార్త్, కేపీపాలెం సౌత్ గ్రామాలకు రూ.43వేలతో నిర్మించేందుకు రెండు నీటి తొట్టెలు మంజూరు చేశామన్నారు. పలు గ్రామాల్లో పంట బోదెల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్క, పూడుకుపోయిన మట్టిని తొలగించే పనులు చేపట్టాని జేఈ ఆనంద్, టీఏ వెంకటేశ్వరరావు తెలిపారు.



స్టేట్ వేర్ గొడౌన్‌ల వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

తణుకు, మే 8(ఆంధ్రజ్యోతి): హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం కృషి చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ.ప్రతాప్ డిమాండ్ చేశారు. గురువారం స్టేట్‌వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గొడౌన్‌ల వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, కార్మికులకు రూ.పది లక్షల ప్రమాద ఇన్సూరెన్సు, ఈఎస్ఐ అమలు చేయాలని కోరుతూ నినాదాలు చేశారు. అనంతరం గొడౌన్ మేనేజర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ధర్నాలో యూనియన్ నాయకులు శ్రీనివాసరావు, నాగబాబు, రమణబాబు, బాషా, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం : ఆరిమిల్లి



లక్ష్మీనారాయణపురంలో సీసీ రోడ్డు ప్రారంభించి, శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

అత్తిలి, మే 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడిన తరువాత గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. మండలంలో కంచుమర్రు, లక్ష్మీనారాయణపురం గ్రామాల్లో పర్యటించిన ఆయన రూ.1.18 కోట్లు విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించారు. కంచుమర్రులో రూ. 6 లక్షల నిధులతో పెద్దపేట డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన, రూ.16లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని తదితర పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామసభలు ఏర్పాటు చేసి ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి పెద్దఎత్తున నిధులు విడుదల చేశారని గుర్తుచేశారు. కంచుమర్రు, లక్ష్మీనారాయణపురం గ్రామ సర్పంచ్‌లు వెంకటకృష్ణంరాజు, నాగేశ్వరరావు గ్రామాల అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారన్నారు. అత్తిలి ఏఎంసీ ఛైర్మన్‌గా నియమితులైన దాసం ప్రసాద్, అత్తిలి మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల ఆదినారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు ఐనంపూడి శ్రీదేవి, లక్ష్మీనారాయణపురం సర్పంచ్ పోలమరశెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం మునిసిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తాడేపల్లిగూడెం రూరల్, మే 8(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం తాడేపల్లిగూడెం మునిసిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆప్కాస్ విధానాన్ని రద్దుచేసి ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించాలనే ప్రభుత్వ నిర్ణయం ఉపసంహరించుకోవాలన్నారు. గత ఏడాది మున్సిపల్ కార్మికులు నిర్వహించిన 17 రోజుల ధర్నాలో ఇచ్చిన హామీలు, జీవోలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు తాడికొండ జయరాం, కొడమంచిలి బాబు, తాడికొండ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అధికారులు ప్రొటోకాల్ పాటించాలి : ఇన్‌చార్జి ఎంపీపీ



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీపీ శ్రీనివాసరావు

యలమంచిలి, మే 8(ఆంధ్రజ్యోతి):ఉన్నతాధికారులు గ్రామాల్లో పర్యటించినప్పుడు ఆయా గ్రామాల్లోని ప్రజాప్రతినిధులకు ముందుగా సమాచారం అందించి ప్రొటోకాల్ పాటించాలని ఇన్‌చార్జి ఎంపీపీ గొల్లపల్లి శ్రీనివాసరావు అధికారులకు సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పలువురు అధికారులు గ్రామాల్లో పర్యటించినపుడు లేదా పరిశీలనకు వెళ్లినప్పుడు తమకు సమాచారం ఇవ్వడం లేదని పలుగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు చెబుతున్నారన్నారు. ఇదే ధోరణి కొనసాగిస్తే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. అనంతరం పలు శాఖల అధికారులు ఆయాశాఖల ప్రగతిని వివరించారు. ఏవో సీహెచ్.దేవి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో 15 వేల మెట్రిక్ టన్నుల లక్ష్యం ఇవ్వగా ఇప్పటివరకు పది వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. విద్యుత్తుశాఖ ఏఈ కిరణ్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు సూర్యఘర్ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఎంపీడీవో ఎస్. ప్రేమాన్విత, తహసీల్దార్ జి.పవన్‌కుమార్, ఊటాడ, పెదలంక గ్రామాల సర్పంచ్‌లు బుడితి జయరాజు, తాళ్ల నాగరాజు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.



ఏసీలు బహూకరిస్తున్న దాత నరసింహమూర్తి

కాళ్ల సొసైటీకి ఏసీల బహూకరణ

కాళ్ల, మే 8(ఆంధ్రజ్యోతి): కాళ్ల సొసైటీ అభివృద్ధికి దాతలు చేస్తున్న కృషి అభినందనీయమని భీమవరం బ్రాంచి మేనేజర్ డీఎస్ సంజయ్, పర్సన్ ఇన్‌చార్జి జి.సత్యనారాయణ అన్నారు. కాళ్ల సహకార సంఘానికి గ్రామానికి చెందిన దాత రెండు ఏసీలను గురువారం బహూకరించారు. బడేటి రామారావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు బడేటి నరసింహమూర్తి సుమారు లక్ష రూపాయలు విలువ చేసే రెండు ఏసీలను అందజేశారు. ఈ సందర్భంగా దాతకు సొసైటీ సిబ్బంది అభినందనలు తెలిపారు. సీఈవో గనిశెట్టి బాబ్జి, రైతులు సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్ టాపర్లకు 'మానవత' సత్కారం

ఆచంట, మే 8(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మండలస్థాయిలో టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులను మానవత శాఖ ఆధ్వర్యంలో సత్కరించారు. గురువారం పాఠంశెట్టి సౌమ్య, శ్రీలేఖ(583), యడ్లపల్లి జయసాయిగణేష్ (577)లను మానవత శాఖ ఆధ్వర్యంలో నగదు అందజేసి సత్కరించారు. మానవత సభ్యులు కుక్కల లీలాప్రసాద్, నెక్కంటి శివన్నారాయణ, కె.శర్మ, గుండాబత్తుల ఆనంద్‌కుమార్, కె.సత్యనారాయణ, టి.సత్యనారాయణమూర్తి, మానేపల్లి వెంకటేశ్వరరావు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు అత్తిలిలో విద్యుత్ అంతరాయం

అత్తిలి, మే 8(ఆంధ్రజ్యోతి): అత్తిలి గ్రామంలో సబ్‌స్టేషన్ వార్షిక మెయింటినెన్స్ నిమిత్తం అత్తిలి గ్రామంలో శుక్రవారం కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో లైన్‌మన్ జామి శ్రీనివాస్ తెలిపారు. గ్రామంలో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేస్తున్నామని ప్రజలు సహకరించాలని కోరారు.

ఘనంగా వెంకన్న కల్యాణం

అత్తిలి, మే 8(ఆంధ్రజ్యోతి): అత్తిలి రైల్వే స్టేషన్‌రోడ్‌లో గల బాలాజీ వేంకటేశ్వరస్వామి వారి కల్యాణాన్ని ఘనంగా గురువారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కోలాటభజన, అన్న సమారాధన నిర్వహించారు. అర్చకులు వాడపల్లి సత్యనారాయణాచార్యులు, వల్లి వెంకటేష్, సూర్య తేజ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

భీమవరం రూరల్, మే 7 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే క్రీడల్లో ఆసక్తి పెంచుకుంటే క్రీడల్లో రాణించగలరని భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిషాంత్‌వర్మ అన్నారు. కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నెలరోజులపాటు చెస్, షటిల్, బ్యాడ్మింటన్‌లో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి.సత్యనారాయణ రాజు అధ్యక్షత వహించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం. జగపతిరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు మాట్లాడారు. షటిల్ బ్యాడ్మింటన్ కోచ్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.రవికిరణ్ వర్మను, చదరంగం కోచ్ ఎస్ఎస్ చంద్రశేఖర్‌ను కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ఎస్ఆర్‌కే నిశాంత్ వర్మ సత్కరించి మొమెంటో అందించారు.

తలసేమియా బాధితులకు బ్లడ్ ఫిల్టర్ కిట్ల అందజేత

పాలకొల్లు అర్బన్, మే 8(ఆంధ్రజ్యోతి): ప్రపంచ తలసేమియా దినోత్సవం సందర్భంగా స్థానిక బ్రాడీపేట బైపాస్ రోడ్డులో గల ఆపదర్బంధు బ్లడ్ బ్యాంక్‌లో ఇరువురు తలసేమియా బాధితులకు బ్లడ్ ఫిల్టర్ కిట్లను రూరల్ లయన్స్ క్లబ్, చిరంజీవి అభిమానులు గురువారం అందజేశారు. నరసాపురానికి చెందిన డి.మేరీ అనే యువతికి, మల్లిపూడికి చెందిన పాముల పూర్ణ సత్యసాయి అనే యువకుడు తలసేమియాతో బాధపడుతున్నారు. వారికి బ్లడ్ బ్యాంక్ నిర్వాహకుడు ఈడుపల్లి శ్రీధర్ పర్యవేక్షణలో చిరంజీవి ఆర్గనైజేషన్ రాష్ట్ర కార్యదర్శి తులా రామలింగేశ్వరరావు, రూరల్‌లయన్స్ క్లబ్ ప్రతినిధులు సొలస సుబ్బారావు, అందజేశారు. కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు కడలి సతీష్, రూరల్ లైన్స్ ప్రతినిధులు కూనపరెడ్డి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

వైభవంగా రామలింగేశ్వర స్వామి ఆలయ పునః ప్రతిష్ఠ

భీమవరంటౌన్, మే 8 (ఆంధ్రజ్యోతి) : భీమవరం రెండో పట్టణంలో శ్రీరామలింగేశ్వర స్వామి (సుబ్బారాయుడి గుడి) దేవస్థాన పునఃప్రతిష్ఠ మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. రుద్రపాక శివశ్రీను శర్మ బ్రహ్మత్వంలో స్వామివారి దేవస్థాన పునఃప్రతిష్ఠ మహోత్సవం జరిగింది. తొలుత రామలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠ, ధ్వజస్తంభం, గణపతి పూజ, నీరాజన మంత్ర పుష్పాలతో పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు స్వామిని దర్శించుకున్నారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.





రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే అంజిబాబు.. బాలాత్రిపుర సుందరి అమ్మవారికి వెండిని అందిస్తున్న దాతలు

బాలా త్రిపుర సుందరి పీఠానికి వెండి బహూకరణ

భీమవరంటౌన్ : పట్టణంలోని మెంటేవారితోటలో వున్న విజయ కనకదుర్గ శ్రీచక్ర సహిత బాలాత్రిపుర సుందరి అమ్మవారి వెండి పీఠానికి దాతలు వంద గ్రాముల వెండిని విరాళంగా అందించారు. గురువారం విశాఖపట్నంకు చెందిన జొన్నల శివనాగరాజు, లక్ష్మీ నాగదేవి దంపతులు వంద గ్రాముల వెండిని విరాళంగా ఆలయ అభివృద్ధి కమిటీకి అందించారు. అర్చకుడు కొమ్ముశ్రీనివాస్ పూజలు చేసి దాతలకు అమ్మవారి చిత్రపటాన్ని అందించి సత్కరించారు.

బాబా ఆలయాల్లో అన్నసమారాధన

మొగల్తూరు : మొగల్తూరు రామాలయం వీధిలో గల షిరిడీ సాయిబాబా ఆలయంలో గురువారం ఘనంగా అన్నసమారాధన నిర్వహించారు. గ్రామానికి చెందిన దివంగత వరదా శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో పెద్దఎత్తున భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. రామన్నపాలెం, కేపీపాలెం, కొత్తోట గ్రామాల్లోని బాబా ఆలయాల్లో అన్నసమారాధనలు నిర్వహించారు.

అఖండ జ్యోతికి 'కొత్తపల్లి' పూజలు

మొగల్తూరు :మూడేళ్లకు ఒకసారి నిర్వహించే ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ అమ్మవారి జాతర సందర్భంగా బుధవారం రాత్రి అఖండ జ్యోతిని వెలిగించారు. గురువారం రాష్ట్ర కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు ఆలయ కమిటీ ఛైర్మన్ కడలి మాణిక్యాలరావు అఖండ జ్యోతిని దర్శించుకుని పూజలు చేశారు. జాతర సంప్రదాయం ప్రకారం అఖండ జ్యోతిని గ్రామానికి చెందిన కరణం కుటుంబ సభ్యులు చెన్నాప్రగడ వంశస్థులు వెలిగించారు. ఈ సందర్భంగా వచ్చేనెల 7వ తేదీ వరకు ఆలయ పరిధి గ్రామాల్లో అఖండ జ్యోతిని ఇంటింటికి తిప్పుతారు.